సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




బుధవారం 15 జూలై 2026 | ● పేజీలు : 08 | ● వెల: 2/- | ● సంపుటి: 2 . సంచిక : 43 | ● ప్రచురణ : సూర్యాపేట | ● ఎడిటర్: శెట్టి వెంకటేష్



## రాష్ట్ర రహదారుల అభివృద్ధిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

ఢిల్లీ, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - తెలంగాణ రాష్ట్రంలో రవాణా వ్యవస్థను సమూలంగా మెరుగుపరిచే దిశగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారితో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు (RRR) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున, తక్షణమే పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రిమండలి అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు; ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండు వైపులా ఏకకాలంలో పనులు చేపట్టడం వల్ల నిర్మాణం వేగంగా పూర్తి కావడమే కాకుండా నిర్మాణ వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించడానికి అనుమతులు ఇవ్వాలని, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్‌కు 12 వరుసల రహదారిని మంజూరు చేయడం ద్వారా హైదరాబాద్ - విజయవాడ మధ్య దూరం 100 కిలోమీటర్లు తగ్గడమే కాకుండా సరుకు రవాణా వేగవంతం అవుతుందని ఆయన తెలిపారు. వీటితో పాటు, మన్ననూరు - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని, హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని ఆయన పేర్కొన్నారు; ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఈ నెల 20న క్యూర్ (CHR) పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం

హైదరాబాద్, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు క్యూర్ (CHR) పరిధిలోనూ అదే సంకల్పంతో పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు, క్యూర్ పరిధిలో దశలవారీగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన ఈ పథకానికి శ్రీకారం చుడుతున్నామని, హైదరాబాద్ మరియు రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మరియు హైదరాబాద్ జిల్లా మంత్రి శ్రీ మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి ఈ పథకానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, దరఖాస్తు విధానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియను వెల్లడిస్తామని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా, పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి 500 నుండి 1000 వరకు ఇళ్లను నిర్మిస్తామని, గత ప్రభుత్వం నగరానికి దూరంగా ఇళ్లు నిర్మించడం వల్ల పేదలు పడిన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, ఈసారి పేదల జీవనోపాధికి, విద్య, వైద్యానికి ఇబ్బంది కలగకుండా, నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని అత్యంత అనువైన ప్రాంతాల్లో ఈ ఇళ్లను నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు; హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో స్థలాలను ఇప్పటికే గుర్తించి, హౌసింగ్ విభాగం ఆధీనంలోకి తీసుకున్నామని, ఇళ్ల నిర్మాణం, డిజైన్ల తుది రూపంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ఢిల్లీ, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - తెలంగాణలో రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గారితో సమావేశమై కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా, వరంగల్ (మామునూరు) మరియు ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని కోరుతూ, వరంగల్ ప్రాంతం ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు కీలక కేంద్రంగా ఉన్నందున, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మరియు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసిన వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (MRO), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులను కల్పిస్తూ, 2028, జూన్ 2 నాటికి పనులను పూర్తి చేయాలని కోరగా, కాకతీయ చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించేలా ఎయిర్‌పోర్ట్ డిజైన్లు ఉండాలని ఆయన సూచించారు. ఇక ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఎయిర్‌పోర్టుతో పాటు పౌర విమానాశ్రయాన్ని నిర్మించాలని, రెండు చోట్లా ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు (FTO) నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు హుస్సేన్ సాగర్ నుండి ప్రకాశం బ్యారేజీకి సీప్లేన్ల నిర్వహణ అంశాన్ని పరిశీలించాలని కోరగా, భూసేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చూపిన వేగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొనగా, అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకాకూడదని, కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## తెలంగాణలో SIR గడువు పొడిగింపు కోసం ఈసీని కలిసిన కాంగ్రెస్ ప్రతినిధులు

హైదరాబాద్, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి గడువును పొడిగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బలమూరి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, మోత రోహిత్ మరియు టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేటర్ కమిటీ చైర్మన్ రాజేష్ తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మరియు గడువు పొడిగింపు ఆవశ్యకతను ఎన్నికల ప్రధానాధికారికి వివరించినట్లు కాంగ్రెస్ ప్రతినిధులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు మరియు నమోదు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు గడువును పొడిగించడం ఎంతో అవసరమని వారు ఈ సందర్భంగా ఆయనకు విన్నవించారు.



## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

హైదరాబాద్, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన శాసనసభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పోరాడిన గొప్ప వ్యక్తిత్వం గల వారని ముఖ్యమంత్రి కొనియాడారు. ముద్రగడ పద్మనాభం గారు రాజకీయ రంగంలో అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు; ఈ కష్టకాలంలో ఆయన కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు తన ప్రగాఢ సానుభూతిని మరియు సంతాపాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో SIR గడువు 24వ తేదీ వరకు పొడిగింపు


भारत निर्वाचन आयोग
ELECTION COMMISSION OF INDIA
निर्वाचन सदन
Nirvachan Sadan,
अशोक रोड, नई दिल्ली-110001
Ashoka Road, New Delhi-110001

No.23/2026-ERS (Vol.-II)
Dated: 14th July, 2026.

To,
The Chief Electoral Officer,
Amravati,
Andhra Pradesh

**Subject:- Special Intensive Revision (SIR) of Electoral Roll w.r.t. 01.07.2026 as the qualifying date-Revised Schedule-regarding.**

Sir,

I am directed to refer to the Commission's order No. 23/2025-ERS (Vol.II) dated 14.05.2026, related to schedule of the Special Intensive Revision and your request vide letter no. 610/Elecs.B/A1/2026-59 dated 13.07.2026, and to state that the Commission has decided to revise the said schedule for Andhra Pradesh as below-

| SL No. | Revision Activities | Revised Schedule |
|---|---|---|
| 1. | House to house visits by BLOs | 15.06.2026 to 24.07.2026 |
| 2. | Rationalization/ Re-arrangement of Polling Stations | By 24.07.2026 |
| 3. | Draft Publication | 31.07.2026 |
| 4. | Period for filling claim & objections | 31.07.2026 to 30.08.2026 |
| 5. | Notice Phase/Disposal of claims & objections | 31.07.2026 to 28.09.2026 |
| 6. | Final publication | 03.10.2026 |

3. All the officials/officers concerned shall be informed of the Commission's above decision and wide publicity to the modified schedule shall be made through all available media. Political Parties shall also be informed of the modified schedule in writing.

Yours faithfully,

(SANDEEP KUMAR)
UNDER SECRETARY

**Copy to:** Chief Secretary, Andhra Pradesh

విజయవాడ, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్, 15 జూలై 2026 - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది; షెడ్యూల్ ప్రకారం ఈరోజుతో ముగియాల్సిన గడువును, పలు ప్రాంతాల్లో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో మరియు వివిధ రాజకీయ పార్టీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ పొడిగింపు నిర్ణయంతో ఓటరు నమోదు ప్రక్రియలో మిగిలిపోయిన వారు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు మరియు సవరణలు చేసుకునేందుకు మరో అవకాశం లభించిందని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టమవుతోంది.



## ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి: సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 15, 2026:సూర్యాపేట జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 27వ వార్డులో కొనసాగుతున్న సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, బూత్ లెవల్ ఆఫీసర్లు (BLOలు) నిర్వహిస్తున్న పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు కనీసం 2,500 ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించేలా ప్రణాళికాబద్ధంగా పని చేసి, నిర్దేశిత గడువులోగా పెండింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు, ఓటర్ల సంతకాలను సరిచూసి, మ్యాపింగ్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిస్తూ, ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ వేణు మాధవరావు, తహసీల్దార్ సాయి గౌడ్, బిఎల్ఓలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఉద్యోగ మేళా – 100 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–సేర్ప్ (ఇ.జి.యం.యం) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 16 జూలై (గురువారం) ఉదయం 10:00 గంటలకు పాత డీఆర్‌డీఏ కార్యాలయం, బైపాస్ రోడ్, సంగారెడ్డిలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో Honour Lab Ltd సంస్థ పాల్గొని 100 ఎగ్జిక్యూటివ్ పోస్టులను ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేయనుంది. B.Sc (కెమిస్ట్రీ), M.Sc (కెమిస్ట్రీ), B.Com, B.A., B.Pharmacy పూర్తి చేసిన 21 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు బొంతపల్లిలో విధులు నిర్వహించాల్సి ఉండగా, వార్షిక వేతనం రూ.2,76,960 నుంచి రూ.2,80,968 (CTC) వరకు అందజేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, అనుభవ ధ్రువపత్రాలు (ఉంటే), ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత తేదీన ఇంటర్వ్యూకు హాజరుకావాలని అధికారులు సూచించారు. జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–సేర్ప్ కోరింది.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 పరీక్షలకు ఉచిత లాంగ్‌టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. ప్రవీణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలో ఉన్న టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో 24 ఆగస్టు 2026 నుంచి మే 2027 వరకు కోచింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు ప్రవేశం కల్పించనుండగా, అందులో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, గతంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన 50 మంది అర్హులను స్క్రీనింగ్ పరీక్ష లేకుండానే నేరుగా ఎంపిక చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టైపెండ్, ఒకసారి రూ.5,000 పుస్తక నిధి, గ్రంథాలయ సౌకర్యం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, సబ్జెక్ట్‌వారీ పరీక్షలు, మూల్యాంకనం వంటి సౌకర్యాలు కల్పించబడతాయి. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగంలో లేకుండా, ఇతర కోర్సులు అభ్యసించకుండా, ఇతర ప్రభుత్వ ఉచిత కోచింగ్ పొందకుండా, యూపీఎస్సీ–2027 నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షల లోపు ఉండాలి. నోటిఫికేషన్ 15 జూలై 2026న విడుదల కానుండగా, 17 జూలై నుంచి 7 ఆగస్టు 2026 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయి. 13 ఆగస్టు నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 16 ఆగస్టున స్క్రీనింగ్ పరీక్ష, 19 ఆగస్టున ఫలితాలు, 21 ఆగస్టు నుంచి ధ్రువపత్రాల పరిశీలన, 24 ఆగస్టు నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ టి. ప్రవీణ్ సూచించారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9494390803 నంబర్లను లేదా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం, వెలుగు ఆఫీస్ క్యాంపస్, బైపాస్ రోడ్, సంగారెడ్డిని కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణపై నిర్వహించిన వెబ్‌ఎక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతి గదిలో తగినంత గాలి, సహజ వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు నాణ్యమైన బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, పచ్చదనం, విద్యా వాతావరణం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా ప్రతి పాఠశాలలో సానుకూల వాతావరణం ఉండాలని, అందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, డీఈఓ రమేష్, ఏఈఈ ఓబులేష్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



## మై భారత్ నమోదు డ్రైవ్ విజయవంతానికి సమిష్టి కృషి చేయాలి: అదనపు కలెక్టర్ పాండు

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: యువతకు జాతీయ స్థాయిలో సేవా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే మై భారత్ (MY Bharat) కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మై భారత్ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న యువతకు జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నాయకత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, యువజన అభివృద్ధికి సంబంధించిన అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన నమోదు లక్ష్యాలను సాధించేందుకు గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టి, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మై భారత్ జిల్లా కార్యక్రమ అధికారి ఎం. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు జిల్లాలో ఇంటెన్సివ్ నమోదు, అవగాహన డ్రైవ్ కొనసాగుతోందని, పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, క్రీడాకారుల భాగస్వామ్యంతో యువతను పెద్ద ఎత్తున మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కే. ధనంజనేయులు, జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ శాఖ అధికారులు, మై భారత్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవల అందింపు, రోగులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ (HDS) తొలి సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి ఆసుపత్రి నిధుల ఆదాయం–వ్యయం, వైద్య సేవలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్సలు, ఓపీ–ఇన్‌పేషెంట్ సేవలు, అత్యవసర వైద్యం, పారిశుద్ధ్యం, మందుల లభ్యత, శస్త్రచికిత్సలు, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది అవసరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యవసర మందులు, శస్త్రచికిత్సలకు అవసరమైన ఇంప్లాంట్లు, ల్యాబ్ రియాజెంట్లు, వైద్య సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాగ్నస్టిక్ సెంటర్‌లో పరీక్షలు నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించి నివేదికలను సకాలంలో అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ నిధులతో ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్, వైద్య పరికరాలు కొనుగోలు చేయడంతో పాటు వార్డుల అభివృద్ధి, సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వసతులు, రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ నిధులను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహించాలని, సిబ్బంది హాజరుపై ప్రత్యేక నిఘా ఉంచి విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెరిగేలా వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదగా, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా ఓపీ విభాగానికి వచ్చే రోగులు ఎండ, వర్షాల బారిన పడకుండా ఓపీ ముందు రేకులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మొరిశెట్టి నివేదిత, డీఎంఈ (అకాడమిక్) డా. ఎం. రామాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. పి. వెంకటరమణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. పి. శ్రావణ్, డా. బి. జనార్ధన్, డా. ఎస్. గీతావాణి, డా. ఎస్. వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, సభ్య కార్యదర్శి పి. శారద, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక.. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు రాష్ట్ర మంత్రుల కృతజ్ఞతలు



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆతిథ్య రాష్ట్రంగా తెలంగాణను ఎంపిక చేసిన సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ద్వారా రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.



## వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర సహకారం: సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో రెండు విమానాశ్రయాల నిర్మాణ అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.50 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో రాష్ట్రం 5 శాతం వాటా కలిగి ఉందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విమానాశ్రయాలు అవసరమని సీఎం పేర్కొన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులను వేగవంతం చేసి 2028 జూన్ 2 నాటికి పూర్తి చేసి ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వరంగల్ విమానాశ్రయం నిర్మాణంలో కాకతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఆకృతిని రూపొందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కోసం అవసరమైన చర్చలు కొనసాగిస్తున్నామని, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.




## ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రైతులతో నేరుగా మాట్లాడి వ్యవసాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నీటి పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు సరైన సమాచారం అందించాలని అన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రోత్సహించాలని, శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ కాలంలో పండే అధిక దిగుబడి రకాల ఎంపికపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. ఐఎండీ హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, రాబోయే మూడు నెలల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని తెలిపారు. భూగర్భ జలాల శాఖ అధికారులు జిల్లాల వారీగా నీటి పరిస్థితిని వివరించి, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, చెరకు వంటి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్, ఐఏఎస్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ఐఏఎస్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ఆగస్టు 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 2వ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమీక్ష నిర్వహించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో అంతర్జాతీయ స్థాయి సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం, భద్రతా ఏర్పాట్లు, రవాణా, వసతి, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, ప్రోటోకాల్, సమావేశ వేదిక నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి బ్రిక్స్‌లోని 11 సభ్య దేశాల నుంచి సుమారు 40 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, భారత ప్రభుత్వానికి చెందిన మరో 40 మంది సీనియర్ అధికారులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. భారత ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (DoPT) సంయుక్త కార్యదర్శి సుశీల్ కుమార్ పటేల్ సమావేశ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశ సమయంలో పటిష్టమైన భద్రతా చర్యలు, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ, అత్యున్నత స్థాయి పారిశుద్ధ్యం, అత్యవసర వైద్య సేవలు, అంతరాయం లేని పౌర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున భారత ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని, అంతర్జాతీయ ప్రతినిధుల సౌకర్యం, భద్రత, సౌలభ్యం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, జీఏడీ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఏడీజీపీ (శాంతిభద్రతలు) మహేష్ భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ (TGBCESDTC) ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 (ప్రిలిమ్స్–కమ్–మెయిన్స్) పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం 24 ఆగస్టు 2026 నుంచి 2027 వరకు కొనసాగుతుందని, మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 100 మంది అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ ద్వారా, మరో 50 మందిని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ప్రిలిమ్స్ అర్హత పొందిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టైపెండ్, ఒకసారి రూ.5,000 పుస్తక భృతి, గ్రంథాలయ సౌకర్యం, నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, మార్గదర్శకత్వం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై, తెలంగాణ నివాసి, భారతీయ పౌరుడై, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తుల ప్రారంభ తేదీ 15 జూలై 2026 కాగా, ఆన్‌లైన్ దరఖాస్తులను 17 జూలై నుంచి 7 ఆగస్టు 2026 వరకు స్వీకరించనున్నారు. హాల్‌టికెట్లను 13 ఆగస్టు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, 16 ఆగస్టున స్క్రీనింగ్ పరీక్ష, 19 ఆగస్టున ఫలితాలు, 21 ఆగస్టు నుంచి ధ్రువపత్రాల పరిశీలన, 24 ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ సూచించారు.

## పారిశుద్ధ్య కార్మికుడి మృతి కేసులో టీజీహెచ్‌ఆర్‌సీ ఆదేశాలు అమలు: రూ.15.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు రెండు ఉద్యోగాలు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: యూసుఫ్‌గూడ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడు మీసాల సుధాకర్ మృతి చెందిన ఘటనకు సంబంధించి తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్‌ఆర్‌సీ) జారీ చేసిన ఆదేశాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అమలు చేసింది. ఈ మేరకు కమిషన్ ఛైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన స్వప్రేరణతో నమోదు చేసిన కేసు (హెచ్‌ఆర్‌సీ నెం.298/2026)ను ముగించింది. జీహెచ్‌ఎంసీ సమర్పించిన నివేదిక ప్రకారం మృతుడి కుటుంబానికి రూ.15.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసినట్లు, అర్హత నిబంధనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులకు రెండు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసినట్లు తెలిపింది. బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో అవసరమైన సహాయం అందించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినందున తదుపరి విచారణ అవసరం లేదని భావించిన టీజీహెచ్‌ఆర్‌సీ కేసును ముగించింది. జీహెచ్‌ఎంసీ తీసుకున్న చర్యలు మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా ఉన్నాయని కమిషన్ పేర్కొంది.

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే ధ్యేయం: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

జోగులాంబ గద్వాల, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లాలో పలు విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ.155 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసి వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## పాఠశాలల్లో అగ్నిమాపక భద్రతపై యాజమాన్యాలకు అవగాహన: తెలంగాణ అగ్నిమాపక శాఖ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: విద్యాసంస్థల్లో అగ్నిమాపక భద్రత, విపత్తు సంసిద్ధతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పాఠశాల యాజమాన్యాల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ ప్రారంభించారు. బేసిక్ ఎలిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ నిష్ఠాలా సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా పాఠశాల యజమానులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సీనియర్ అడ్మినిస్ట్రేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ అగ్నిమాపక భద్రత అనేది కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాదని, విద్యార్థుల ప్రాణాలను కాపాడాల్సిన ప్రతి పాఠశాల యాజమాన్యం యొక్క నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, అగ్నిమాపక రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం, మాక్ డ్రిల్స్ చేపట్టడం, విద్యార్థులు, సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంచడం అవసరమని సూచించారు. దేశంలోని పలు పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటనలను ఉదాహరణగా చూపిస్తూ నిర్లక్ష్యం, సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999 నిబంధనలు, పాఠశాల భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారు. తనిఖీల సమయంలో గుర్తించే సాధారణ లోపాలు, వాటి నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను సురక్షితంగా తరలించే విధానం, ఫైర్ అలారం వ్యవస్థలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, విద్యుత్ భద్రత, హాస్టళ్లలో అగ్నిమాపక జాగ్రత్తలపై యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థలతో సమన్వయంతో పనిచేస్తూ అగ్నిప్రమాదాల నివారణ, విపత్తు సంసిద్ధతను పెంపొందించి తెలంగాణలో ప్రతి చిన్నారికి సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ అగ్నిమాపక శాఖ వెల్లడించింది.

## తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ నియామకం



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ప్రతిష్ఠాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాష పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించే తెలుగు అకాడమీ బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్‌కు అప్పగించడంపై విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్‌కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధన అనుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా సేవలందించడంతో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. గిరిజన సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన ఆయన జానపద, గిరిజన సంస్కృతుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. పలు మేజర్, మైనర్ పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేసిన ఆయన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. జానపద, గిరిజన విజ్ఞానానికి సంబంధించి 30కి పైగా పరిశోధనా గ్రంథాలకు సంపాదకత్వం వహించడంతో పాటు ఏడు పుస్తకాలను స్వయంగా రచించారు. గిరిజన బాలల కోసం 'బంజారా భారతి', 'బంజారా గణితం' వంటి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన పర్యవేక్షణలో పలువురు పరిశోధకులు ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. విద్యారంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్న ఆచార్య భట్టు రమేష్, గతంలో శాంతి చర్చల మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర స్థాయి మద్యపాన నిషేధ సలహా కమిటీ సభ్యుడిగా, గిరిజన భూ రక్షణ చట్టాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వరంగల్ జిల్లాలో గుడుంబా ప్రభావిత గ్రామాల్లో గిరిజన మహిళలు, యువతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం నుంచి 2014లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, గిరిజన సాహిత్యం, జానపద కళల రంగంలో చేసిన కృషికి గాను 2017లో డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా నియామకం అనంతరం ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా వికాసం, పాఠ్యపుస్తకాల నాణ్యమైన ప్రచురణ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నేడు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**Press Note**
**District Election Officer (Nagarkurnool)**

***Clarification Regarding Voter Registration Rumors in Achampet AC***

It has come to notice of undersigned that false information is circulating on social media regarding the voter status of the Honorable Chief Minister, Sri Anumula Revanth Reddy, in Nagarkurnool district.

As the District Election Officer (DEO) for Nagarkurnool, below clarification is issued concerning district jurisdiction:

- **There is no voter registration for Sri Anumula Revanth Reddy in Achampet Assembly Constituency or anywhere within Nagarkurnool district as on today.**
- There is absolutely no case of double voting or dual enrolment in Nagarkurnool district in this particular case.
- As the voter enrolment is not there, the question of Enumeration Form printing and distribution in the process of Special Intensive Revision does not arise.
- Citizens are requested not to believe or spread baseless rumours.

**Collector and District Election Officer**
**Nagarkurnool District**
**(14th July 2026)**

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేడు (15-07-2026) రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న సీఎం, అనంతరం ఫ్యూచర్ సిటీలో మధ్యాహ్నం 12.15 గంటలకు నిర్వహించే అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలోని అమర రాజా గిగా కారిడార్‌లో సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు




## ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందజేయండి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓలు) అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ పిలుపునిచ్చారు. ఓటర్లు తమ విలువైన ఓటు హక్కును కాపాడుకునేందుకు ఈ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు. బీఎల్ఓలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి అందించాలని తెలిపారు. ఫారంలో ఓటరు సంతకం, తేదీతో పాటు బీఎల్ఓ సంతకం కూడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకదానిని బీఎల్ఓలకు తిరిగి ఇవ్వాలని, మరొకదానిని ఓటర్లు భద్రపరుచుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు సమర్పించినప్పుడే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటరు వివరాలు ఉన్నట్లయితే వాటిని తప్పనిసరిగా నమోదు చేయాలని, లేని పక్షంలో ప్రస్తుత వివరాలతో ఫారం పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది (49.28 శాతం) ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించినట్లు సీఈఓ వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 2026 జూన్ 25న ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు ఆలస్యం చేయకుండా తక్షణమే పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలని ఆయన కోరారు.




## TJWA సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా CH. బస్వరాజు నియామకం

సంగారెడ్డి, జూలై 15: తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) రిజిస్ట్రేషన్ నెం. 288/2026 సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీ CH. బస్వరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా TJWA జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శెట్టి వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా TJWA సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తరించడం, జర్నలిస్టుల సమస్యలను గుర్తించి రాష్ట్ర, జాతీయ కమిటీ దృష్టికి తీసుకెళ్లడం, జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడం, మండల, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయడం, జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయడం జిల్లా అధ్యక్షుని ప్రధాన బాధ్యతలని తెలిపారు. సంఘ నియమావళిని పాటిస్తూ సభ్యుల మధ్య ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించేలా సమర్థవంతమైన నాయకత్వం అందించాలని సూచించారు. శ్రీ CH. బస్వరాజు నాయకత్వంలో సంగారెడ్డి జిల్లాలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ మరింత బలోపేతమై జర్నలిస్టుల సంక్షేమానికి విశేష సేవలు అందిస్తుందని TJWA జాతీయ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది: 49.28 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. 2026 జూలై 14 సాయంత్రం 6 గంటల నాటికి రాష్ట్రంలోని మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 3,38,21,554 ఎన్యూమరేషన్ ఫారాలు (99.99 శాతం) పంపిణీ చేయగా, ఇప్పటివరకు 1,66,70,610 ఫారాలు (49.28 శాతం) డిజిటైజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే సూర్యాపేట జిల్లాలో 10,08,252 మంది ఓటర్లకు గాను 10,08,252 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 4,59,942 ఫారాలు (57.61 శాతం) డిజిటైజ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 14,57,436 మంది ఓటర్లకు గాను 14,57,412 ఫారాలు పంపిణీ చేసి, 7,25,523 ఫారాలు (49.78 శాతం) డిజిటైజ్ అయ్యాయి. అత్యధిక డిజిటైజేషన్ శాతం సాధించిన జిల్లాల్లో యాదాద్రి భువనగిరి 79.86 శాతం, సిద్దిపేట 72.11 శాతం, కుమురం భీం ఆసిఫాబాద్ 70.79 శాతం, నిజామాబాద్ 70.22 శాతం, రాజన్న సిరిసిల్ల 69.86 శాతం జిల్లాలు ముందంజలో ఉన్నాయి.

ఇక హైదరాబాద్ జిల్లాలో మొత్తం 47,36,669 మంది ఓటర్లకు గాను 47,36,660 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 10,52,490 ఫారాలు (22.22 శాతం) డిజిటైజ్ అయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో 36,99,743 మంది ఓటర్లకు గాను 12,36,659 ఫారాలు (33.43 శాతం) డిజిటైజ్ చేశారు.

ఎన్నికల అధికారులు ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితంగా రూపొందుతుందని అధికారులు తెలిపారు.



# గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, జూలై 15: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన పేద కుటుంబానికి పక్కా గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసీల్దార్ శ్రీనివాస చారి, ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో విడతలో ప్రాధాన్యత ఇచ్చే గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో సంవత్సరం కావస్తున్నా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 9 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 83 శాతం పురోగతి సాధించామని, 1700 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరిగాయని తెలిపారు. 2400 ఇళ్లు స్లాబ్ పూర్తి చేసుకుని ఫెన్సింగ్ దశలో ఉన్నాయని, 650 ఇళ్లు రూమ్ లెవెల్‌లో, 1400 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉన్నాయని, మిగతా ఇళ్లు పునాది దశలో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటివరకు 1600 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని, వారికి అవగాహన కల్పించి త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని, గుడిసెల్లో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, జూలై 15: మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధిలో భాగంగా రూ.2 కోట్ల 93 లక్షల నిధులతో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడం తన బాధ్యత అని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మెదక్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా పనుల రూపంలో కనిపించాలనే ఉద్దేశంతో ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఏ వార్డు వెనుకబడకుండా అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడతామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి మెదక్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలబెడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

మెదక్, జూలై 15: ప్రతి కేసులో వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టబద్ధమైన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని నియమించి రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆర్థిక నేరాల నివారణలో భాగంగా వాహన తనిఖీలు, నాకాబందీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, బ్లూ కోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలాన్ పరికరాల ద్వారా అనుమానితుల వివరాలు సేకరించాలని సూచించారు. గ్రామాల్లోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, దుకాణాలు, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు వంటి కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు రేణుక, రాజశేఖర్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, మహేష్, జార్జ్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# మెదక్ జిల్లాలో 55 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తి: కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, జూలై 15: మెదక్ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 55 శాతం నమోదు పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ నెల 24వ తేదీ చివరి గడువు ఉందని, గడువులోగా నూరు శాతం నమోదు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో 4.55 లక్షల మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 55 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు వాటిని సక్రమంగా పూర్తి చేయించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వాట్సాప్ గ్రూపుల ద్వారా వీడియోలు, సందేశాలు పంపించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. శని, ఆదివారాల్లో అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక ఎస్ఐఆర్ శిబిరాలు నిర్వహించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ నవీన్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం చేసిన వారమవుతాం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి జూలై, 15

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కోర్టు–పోలీసు సమన్వయ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం చేసిన వారమవుతామని అన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో పాటు కోర్టు–పోలీసు శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. కోర్టు సమన్లు, వారెంట్లు, చార్జిషీట్లు, కేసు పత్రాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా విచారణ వేగవంతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించడమే మెదక్ జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. పోలీసు శాఖ, న్యాయవ్యవస్థ సమన్వయంతో ఈ ఏడాది జిల్లాలో 20 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయని, వాటిలో 12 కేసుల్లో జీవిత ఖైదు, 5 కేసుల్లో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షలు, మరో 3 కేసుల్లో ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ జైలు శిక్షలు విధించబడ్డాయని వివరించారు. నాణ్యమైన దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆధారాల వినియోగం, సమయానికి చార్జిషీట్లు దాఖలు చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సమావేశం అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు, ఎస్సైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేత వాసిరెడ్డి వెంకటేశ్వర్లును పరామర్శించిన మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మం, జూలై 15: ఏన్కూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వర్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆయనను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి వెంకటేశ్వర్ల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించిన నామ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.



## కేజీబీవీ టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాం: అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి జులై, 15 మెదక్ జిల్లాలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (KGBV), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల వసతిగృహాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు అవసరమైన చికెన్, మటన్, కూరగాయలు, పండ్ల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో టెండర్లలో పాల్గొన్న గుత్తేదారుల సమక్షంలో లాటరీ విధానం ద్వారా సరఫరాదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 19 కేజీబీవీలు, 6 తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల వసతిగృహాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని గుత్తేదారులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి నాణ్యతలో రాజీ పడే గుత్తేదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, వసతి గృహ సంక్షేమ అధికారులు, ప్రిన్సిపల్స్, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ అంకె అప్పారావు మృతికి లింగాల కమల్ రాజు నివాళులు

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్ మధిర, జూలై 15: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆత్కూరు మాజీ సర్పంచ్ అంకె అప్పారావు అకాల మరణం చెందడంతో జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ లింగాల కమల్ రాజు స్థానిక నాయకులతో కలిసి ఆయన పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ అప్పారావు గారి మరణం ఎంతో దురదృష్టకరమని, ప్రజా సేవలో ఆయన చేసిన సేవలు గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, చావా వేణుబాబు, అబ్బూరి రామన్, వై.వి. అప్పారావు, బొగ్గుల వీరారెడ్డి, సయ్యద్ ఇక్బాల్, ఆళ్ల నాగబాబు, కురేష్, దిల్ కుమార్, మీనుగు పాండు, బెజ్జం కిరణ్, రాము, బోగ్యం ఇందిర, షేక్ షారు, మర్రి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

## లచ్చగూడెంలో కుటుంబాన్ని పరామర్శించిన లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్ మధిర, జూలై 15:మధిర నియోజకవర్గం లచ్చగూడెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు కుటుంబాన్ని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ లింగాల కమల్ రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురిజాల హనుమంతరావు సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఆశీర్వాద సభతో రైతులకు ఒరిగిందేమిటి: లింగాల కమల్ రాజు

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్ మధిర, జూలై 15: చింతకాని మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్చార్జి లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఐఆర్ కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి బీఎల్ఏలను నియమించామని, గ్రామాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించి ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం లింగాల కమల్ రాజు మాట్లాడుతూ రైతు ఆశీర్వాద సభ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతు భరోసా, దళిత బంధు వంటి పథకాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతు ఆశీర్వాద సభ రైతుల సమస్యల పరిష్కారానికి కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభగా మారిందని అన్నారు. రైతులకు రూ.15 వేల రైతు భరోసా, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.4 వేల పెన్షన్ వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో చింతకాని మండలంలో దళిత బంధు ద్వారా అనేక కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం లచ్చగూడెం గ్రామానికి వెళ్లి మాజీ ఎంపీపీ గురజాల హనుమంతరావును లింగాల కమల్ రాజు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మంకేన రమేష్, వంకాయపాటి లచ్చయ్య, బొడ్డు వెంకటరామారావు, పొనుగోటి రత్నాకర్, గడ్డం శ్రీనివాసరావు, పిన్నెల్లి శ్రీనివాస్, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 3½ ఏళ్ల చిన్నారిపై అఘాయిత్యం.. నిందితుడికి జీవిత ఖైదు



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ,జూలై, 15, 3½ ఏళ్ల పసిబాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలకల్ గ్రామంలో 2025 మార్చి 10న ఈ ఘటన చోటుచేసుకోగా, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన చిన్నారి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బీహార్‌కు చెందిన తున్న కుమార్ (20) చిన్నారిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద చిన్నారిని గుర్తించి రక్షించి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించారు. బాధిత చిన్నారికి రూ.5 లక్షల విక్టిమ్ కాంపెన్సేషన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, దర్యాప్తు అధికారులు, భరోసా బృందం, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, చిన్నారుల భద్రత అందరి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిల సాధనకు ఇందిరాపార్క్ వద్ద బీసీ సంక్షేమ సంఘం దీక్ష






సంగారెడ్డి, జూలై 15 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్)విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య చేపట్టిన ఈ దీక్షకు సంఘీభావంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీసీల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆర్. కృష్ణయ్య విద్యార్థుల భవిష్యత్ కోసం ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా దీక్ష కొనసాగిస్తున్నారని అన్నారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి వారి చదువులు కొనసాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం. శేఖర్, సంగారెడ్డి జిల్లా కోశాధికారి కే. సుధాకర్ గౌడ్, అడ్వైజర్ కరణ్ జిత్ సింగ్, కార్యదర్శులు శ్రీనివాస్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



# గీతం యూనివర్సిటీలో న్యాయ బాధ్యతలపై అవగాహన సదస్సు

సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి జూలై, 15, సంగారెడ్డి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (DLSA) ఆధ్వర్యంలో రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో విద్యార్థులకు "న్యాయ బాధ్యతలు మరియు పౌరుల చట్టపరమైన బాధ్యతలు" అనే అంశంపై మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ (NALSA), రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవాని చంద్ర సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు చట్టబద్ధమైన బాధ్యతలను కూడా తెలుసుకుని పాటించాలని సూచించారు. రాజ్యాంగ విలువలు, చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణ, ర్యాగింగ్ నిషేధం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారు NALSA టోల్ ఫ్రీ నంబర్ 15100 లేదా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినాయక రెడ్డి, గీతం యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆత్మగౌరవానికి అనుగుణంగా శౌచాలయాలు ఏర్పాటు చేయాలి: అస్మా

సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి జూలై, 15,జహీరాబాద్ పట్టణంతో పాటు సంగారెడ్డి జిల్లాలో మహిళలకు అవసరమైన ప్రాంతాల్లో ఆధునిక శౌచాలయాలు నిర్మించి, ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరచాలని కోరుతూ జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అస్మా మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలోని పలు శౌచాలయాల వద్ద చిరు వ్యాపార దుకాణాలు ఆక్రమించడంతో అవి ఉన్నాయనే విషయం కూడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని, సంబంధిత ప్రాంతాల ఫొటోలను కలెక్టర్‌కు చూపించి వివరించారు. ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి సుమారు 20 నుంచి 30 వేల మంది ప్రజలు జహీరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ మహిళలకు అవసరమైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో మహిళలు బయటకు వెళ్లే సమయంలో నీరు తాగడానికి కూడా వెనుకాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. మహిళల ఆత్మగౌరవం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, సురక్షితమైన శౌచాలయాలను ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ జిల్లాలోని అన్ని మరుగుదొడ్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి జూలై, 15, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణతో కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బైండ్ల కృష్ణ సంస్థ అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకుని సమాజ సేవలో విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ విఠల్, జర్నలిస్ట్ జ్ఞానేశ్వర్‌తో పాటు సంస్థ సభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొని కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.



# ఎస్ఐఆర్ ఫారాల డిజిటైజేషన్ నిర్ణీత గడువులో పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జి శెట్టి సురేష్ జూలై, 15,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా డిజిటైజేషన్ పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో శివాలయం వీధిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ, డిజిటైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు వాటిని పూర్తిగా పూరింపజేసి సకాలంలో తిరిగి స్వీకరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డేటా ఎంట్రీలో జాప్యం జరుగుతున్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని వినియోగించి పెండింగ్ ఫారాలను పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు బీఎల్ఓలు అవసరమైన సహకారం అందించి ఫారాల పూర్తి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా సవరణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, ఈ నెల 24వ తేదీలోగా డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# టెట్‌లో 14,814 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫెయిల్.. ఉత్తీర్ణత 37.29 శాతమే

సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి జూలై, 15.తెలంగాణలో గత నెల నిర్వహించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. మొత్తం 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షకు హాజరుకాగా, వారిలో కేవలం 8,809 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించి 37.29 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మరో 14,814 మంది ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. గత ఏడాది నిర్వహించిన టెట్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉత్తీర్ణత 50 శాతం ఉండగా, ఈసారి అది 37.29 శాతానికి పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి తప్పనిసరిగా టెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉండటంతో, అర్హత సాధించని ఉపాధ్యాయుల ఉద్యోగ భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

# ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్ పటాన్‌చెరు, జూలై 15 (బి. డేవిడ్) రామచంద్రాపురం ప్రాంతంలోని నూతన దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెల తండాలో ఉన్న భవాని మాత దేవాలయంలో నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాన్ని సొంత నిధులతో నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో MDR ఫౌండేషన్ SIR హెల్ప్ డెస్క్



సందేశం టైమ్స్ పటాన్‌చెరు, జూలై 15, పటాన్‌చెరు జేపీ కాలనీ జీహెచ్ఎంసీ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అమూల్యమైన హక్కు కావడంతో అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న సందేహాలు, గందరగోళాన్ని తొలగించేందుకు MDR ఫౌండేషన్ వాలంటీర్లు మార్గదర్శకత్వం అందిస్తూ, ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో సహాయం చేస్తున్నారు. పూర్తి చేసిన ఫారాలను సంబంధిత అధికారులకు అందజేసే వరకు బాధ్యతగా సేవలు అందిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రజల ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా ఈ హెల్ప్ డెస్క్ పనిచేస్తుందని పేర్కొన్నారు.



# మానవతా సేవతో జన్మదిన వేడుకలు.. పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసిన బైండ్ల కృష్ణ

సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి జూలై, 15,సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అరుణ శ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అఖిల్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టులు విట్టల్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. "మానవతా సేవే మహోన్నత సేవ" అనే సందేశంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.



# ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్ పటాన్‌చెరు, జూలై 15 (బి. డేవిడ్)పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటి సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయడానికి నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయిన అనంతరం టైలర్స్ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్యలు ఉండవని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి అన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యకు జగ్గారెడ్డి అభినందనలు

సందేశం టైమ్స్ సంగారెడ్డి, జూలై 15 (జిల్లా కోఆర్డినేటర్)కుంగ్‌ఫూ కరాటే కటా విభాగంలో అరుదైన ఘనత సాధించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభినందించారు. మంగళవారం సంగారెడ్డిలో పోచయ్య జగ్గారెడ్డిని కలిసి తాము సాధించిన ప్రపంచ రికార్డు వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి పోచయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కుంగ్‌ఫూ కరాటే కటా విభాగంలో పోచయ్యతో పాటు ఆయన శిష్య బృందం ఏప్రిల్ 26న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రదర్శనలో కేవలం అరగంటలో 72 సార్లు కటా ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ రికార్డును అధికారికంగా ధృవీకరిస్తూ లండన్ నుంచి సర్టిఫికెట్లు అందాయి. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పోచయ్య బృందం కుంగ్‌ఫూ క్రీడలో తొలిసారిగా ఈ అరుదైన ఘనత సాధించడం విశేషం. గతంలో ఉన్న ప్రపంచ రికార్డును అధిగమించి కొత్త రికార్డు నెలకొల్పిన పోచయ్య బృందాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





# అమావాస్య సందర్భంగా పితృ తర్పణాలు, దానధర్మాలకు ప్రాధాన్యత

సందేశం టైమ్స్ ఆధ్యాత్మికం, జూలై 15,జ్యేష్ఠ మాస అమావాస్య సందర్భంగా రేపు (బుధవారం) భక్తులు పితృ తర్పణాలు, దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమావాస్య పర్వదినం సందర్భంగా వటసావిత్రి వ్రతం, జ్యేష్ఠ అమావాస్య ప్రత్యేకతలను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పితృదేవతలకు తర్పణాలు సమర్పించడం, దానాలు చేయడం ద్వారా పుణ్యఫలాలు లభిస్తాయని పండితులు తెలిపారు.

పంచాంగం ప్రకారం అమావాస్య తిథి సాయంత్రం 4.04 గంటల వరకు కొనసాగనుంది. అనంతరం పాడ్యమి ప్రారంభమవుతుంది. పునర్వసు నక్షత్రం రాత్రి 2.12 గంటల వరకు ఉండగా, ఆ తరువాత పుష్యమి నక్షత్రం ప్రారంభమవుతుంది. వ్యాఘాత యోగం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగి అనంతరం హర్షణ యోగం ప్రారంభమవుతుంది.

ఈ సందర్భంగా శివారాధన, నాగదేవత పూజలు, కాలభైరవ స్వామి ఆరాధన, గోమాత పూజలు నిర్వహించడం విశేషమని ఆధ్యాత్మిక పండితులు తెలిపారు. అమావాస్య రోజున పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం శుభప్రదమని పేర్కొన్నారు.

సూర్యోదయం ఉదయం 5.34 గంటలకు, సూర్యాస్తమయం సాయంత్రం 6.32 గంటలకు జరుగుతుందని పంచాంగ వివరాలు వెల్లడిస్తున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేయనున్నారు.

సర్వేజనా సుఖినో భవంతు – శుభమస్తు

పత్రిక పేరు: సందేశం టైమ్స్ (Sandesham Times)- రిజిస్ట్రేషన్ నం: TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, (పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ- 508206, ప్రచురణకర్త /publisher: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006.